'తడి' లేదు... 'పొడి' లేదు

- నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
- ఒక్కోషెడ్‌కు దాదాపు రెండున్నర లక్షలు
- నిర్వహణ మరిచిన అధికారులు
- గ్రామ శివారులో చెత్త వేస్తున్న పంచాయతీ సిబ్బంది



నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు   గ్రేడింగ్ చేయకుండా కుప్పలుగా పోసిన చెత్త(ఇన్‌సెట్‌లో)

గొల్లపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపచ్చి, గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చాలని గత ప్రభుత్వం పల్లెప్రగతిలో భాగంగా సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువులుగా తయారుచేసి పంచాయతీలు ఆదాయం పొందాలని వీటి నిర్మాణం చేపట్టారు. కానీ ఈ షెడ్లు గొల్లపల్లి మండలంలో ఎక్కడా వినియోగంలో ఉన్నట్లు కన్పించడం లేదు. లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణను పంచాయతీలు గాలికొదిలేయడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

లక్షలాది నిధులు వృథా...

గొల్లపల్లి మండలంలో ఉన్న 27 గ్రామాల్లో రూ.2.5లక్షల చొప్పున సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో తడి, పొడి, ప్లాస్టిక్, గాజు, అట్ట, పేపర్ తదితర చెత్తను వేర్వేరుగా నిల్వ చేసేందుకు గదులు ఏర్పాటు చేశారు. దీంతో పాటు చెత్త తరలించడానికి ప్రతి పంచాయతీ ట్రాక్టర్లను కొనుగోలు చేసింది. తడి, పొడి చెత్త వేరు చేసేందుకు ఇంటింటికీ బుట్టలు పంపిణీ చేశారు. అయితే సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ అవి పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. ప్రారంభదశలో వాటి నిర్వహణపై ఆసక్తి కనబర్చిన అధికారులు తర్వాత పట్టించుకకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. పారిశుద్ధ్య సిబ్బంది చెత్త సేకరించే సమయంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలి. అక్కడ సెగ్రిగేషన్ షెడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలలో తడి, పొడి చెత్తను వేయాలి. పొడి చెత్తను అమ్మి ఆ సొమ్మును గ్రామపంచాయతీ అభివృద్ధికి వినియోగించాలి. తడి చెత్తను దాదాపు 45 రోజుల పాటు దశలవారిగా సేంద్రియ ఎరువును తయారు చేయాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో అవేమి జరగడం లేదు. చెత్తను డంపింగ్ యార్డులకు తరలిస్తున్న సిబ్బంది గ్రేడింగ్ చేయకుండా కుప్పలుగా పారపోస్తున్నారు. చెత్తను అడ్డగోలుగా పోస్తుండటంతో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు గాలికి పంటపొలాల్లో చేరి రైతులు ఇబ్బంది పడుతున్నారు.

డంపింగ్‌యార్డులకు తరలని చెత్త

మండలంలోని పలు గ్రామాల్లో చెత్త డంపింగ్‌యార్డులకు తరలడం లేదు. గ్రామాల్లో రోడ్ల వెంటనే చెత్తచెదారం దర్శనమిస్తోంది. దుర్వాసన రావడంతో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు పంచాయతీ సిబ్బంది ఆ చెత్తను వారం రోజులకోసారి తీసుకెళ్లి గ్రామ శివారులో పడేసి మంట పెడుతున్నారు. దీంతో దారిన వెళ్లే వారికి సమస్యగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి సెగ్రిగేషన్, డంపింగ్‌యార్డుల నిర్వహణ పూర్తిస్థాయిలో చేపట్టి గ్రామపంచాయతీలకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. పంచాయతీ అధికారులతో మాట్లాడి గ్రామాల్లో చెత్తను రోజువారిగా డంపింగ్ యార్డుకు తరలించేలా ఆదేశాలు జారీచేస్తాం. ప్రతి సెగ్రిగేషన్ షెడ్లలో ఎరువులు తయారుచేసి పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా కృషి చేస్తాం. – రాంరెడ్డి, ఎంపీడీవో, గొల్లపల్లి

సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా



ధర్మపురిలో కేంద్ర బలగాల కవాతు

ధర్మపురి: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలో శుక్రవారం కేంద్ర బలగాల కవాతును నిర్వహించారు. డీఎస్పీ రఘుచందర్, ఏఆర్ అదనపు ఎస్పీ భీంరావ్, ఏఆర్ డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ రాంనర్సింహరెడ్డి నేతృత్వంలో కేంద్ర బలగాల కవాతును నిర్వహించారు. పట్టణంలోని గాంధీ, నంది కూడలిల నుంచి అంబేడ్కర్ చౌక్ మీదుగా కవాతు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు అందరూ పాటించాలన్నారు. నంది కూడలి వద్ద ఏఆర్ ఏఎస్పీ భీంరావ్, డీఎస్పీలను మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో కేంద్ర బలగాలు యోగేందర్, ఏఆర్ సీఐ వేణు, ఎస్సైలు ఉదయ్‌కుమార్, సతీష్, శ్రీధర్‌రెడ్డి, ఉమాసాగర్, కేంద్ర బలగాలు తదితరులున్నారు.

'ఫేక్ ప్రొసీడింగులు ఇచ్చినందుకే కొప్పుల ఓటమి'



మాట్లాడుతున్న ఫ్లోర్ లీడర్ నాగలక్ష్మి

ధర్మపురి: అసెంబ్లీ నియోజకవర్గంలో ఫేక్ ప్రొసీడింగులు చూపించి ప్రజలను తప్పుదోవ పట్టించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించి గుణపాఠం చెప్పారని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వేముల నాగలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మూడు సార్లు పాలించిన కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి నియోజకవర్గానికి అభివృద్ధి చేయనందుకే ఆయన్ను ఓడించారని మూడుసార్లు ఓడినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటున్న అడ్లూరిని భారీ మెజారిటీతో పట్టం కట్టారన్నారు. కోట్లాది రూపాయల తప్పుడు జీవో కాపీలు తెచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో 8 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అప్పుడు రైతాంగానికి చేసిన న్యాయం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున గెలుపు కోసం రైతులకు మద్దతుగా కపట ప్రేమ చూపిస్తున్నారని దీన్ని రైతులంతా గమనిస్తున్నారని అన్నారు. ఇక నుండి లక్ష్మణ్‌కుమార్‌పై అబద్ధపు ఆరోపణలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సంతోషి, గరిగె అరుణ, జక్కు పద్మ, నాయకులు వేముల రాజేశ్, లక్ష్మణ్, కుంట సుధాకర్, రాందేని మొగిలి తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారం



అలయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కోరుట్ల: పట్టణంలోని సినారే కళా భవన్‌లో జగిత్యాల జిల్లా అలయన్స్ క్లబ్ 271 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అలై బాలచంద్రన్ మాట్లాడుతూ అలయన్స్ క్లబ్ జగిత్యాల జిల్లా కోరుట్ల సేవలు అభినందనీయమన్నారు. జిల్లా గవర్నర్‌గా అలై కటుకం సురేందర్, జిల్లా ఉప గవర్నర్‌గా అలై కైలాస నాగేశ్వర్ రావు, కేబినెట్ సెక్రటరీగా పాటిల్ ధరందీప్, ట్రెజరర్‌గా బెల్లాల ఎల్లారెడ్డి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా అలై కటుకం రాజశేఖర్ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బాల గంగాధర శాస్త్రి, అడ్వైజర్ రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంజన్న స్వాములకు వీహెచ్‌పీ స్వాగతం



అంజన్న స్వాములకు పాద పూజ చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

జగిత్యాలటౌన్: పాదయాత్రగా తరలివచ్చిన హనుమాన్ దీక్షా స్వాములకు శుక్రవారం ఉదయం వీహెచ్‌పీ నాయకులు స్వాగతం పలికి పాదపూజ చేశారు. ఈనెల 3న జగిత్యాల నుంచి భద్రాచలం వరకు పాదయాత్రగా వెళ్లి సీతారాముల దర్శనం చేసుకుని శుక్రవారం ఉదయం జగిత్యాలకు చేరుకున్న స్వాములకు విశ్వహిందూ పరిషత్ నాయకులు పాద పూజ చేసి ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్, జిల్లా కోశాధికారి మామిడాల రాములు, సహ కార్యదర్శి గాజోజు సంతోష్, నగర అధ్యక్షుడు జిట్టవేణి అరుణ్, స్వాములు పాల్గొన్నారు.

జెండా పైపు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



సీఐకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని 24వ వార్డ్ నటరాజ్ చౌరస్తా వద్ద గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బీజేపీ జెండా గద్దె వద్ద పైపులు విరగొట్టిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు శుక్రవారం పట్టణ సీఐ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశారు. నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రంగు గోపాల్, నాయకులు ఆముదరాజు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న పత్తిపాక వెంకటేష్

వెల్గటూర్ : పార్టీ కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చల్లూరి రాంచందర్ అధ్యక్షతన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. పార్టీ అభ్యర్థి విజయం కోసం నాయకులు, కార్యకర్తలు అంతా సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లూరి రాంచందర్, జూపాక కుమార్, గంధ్ర నర్సింగరావు, గూడ రాంరెడ్డి, జక్కుల రామయ్య, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోరుట్ల: పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, లయన్స్ క్లబ్ కోరుట్ల కోటి నవదుర్గ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 80 మందికి కంటి ఆపరేషన్ అవసరం కాగా రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లయన్ వనపర్తి చంద్రమోహన్, కోటి నవదుర్గ అధ్యక్షురాలు రమ్య, లయన్ కృష్ణ ప్రసాద్, రాధిక, డాక్టర్ దిలీప్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

జగిత్యాల: ఉద్యోగుల వయస్సు 61 ఏళ్లు లేదా, 33 ఏళ్ల సర్వీస్ పూర్తయితే రిటైర్‌మెంట్ చేయాలని సోషల్ మీడియాలో వైరల్ అవుతుందని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామ్‌సుందర్, భూమేశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వార్తలతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందని, సర్వీస్‌ను 33 ఏళ్లకు పరిమితం చేయడం సమంజసం కాదని, ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు.

సీనియర్ సిటిజన్ల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న హరి అశోక్‌కుమార్

జగిత్యాలటౌన్: సీనియర్ సిటిజన్ల డిమాండ్లు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ కోరారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో జిల్లా, డివిజన్, మండల, గ్రామ శాఖల ప్రతినిధులకు వయోవృద్ధుల చట్టం పుస్తకాలను అందజేశారు. అనంతరం అశోక్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధుల సమావేశాల కోసం హైదరాబాద్‌లో 2 ఎకరాల స్థలం, భవన నిర్మాణం కోసం రూ 10కోట్లు కేటాయించాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007లో ప్రతిపాదించిన సవరణ బిల్లు 2019ని పార్లమెంట్‌లో పెట్టి ఆమోదింపచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు పిసి హన్మంతరెడ్డి, బొల్లం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సీనియర్లను హేళన చేస్తున్నారు'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సారంగాపూర్: నిన్న, మొన్న బీజేపీలోకి వచ్చిన వారిని అందలం ఎక్కిస్తున్నారని, కొత్తగా పార్టీలో చేరిన వారు సీనియర్లను అవహేళన చేసి మాట్లాడుతున్నారని వారు పేర్కొన్నారు. వివిధ హోదాల్లో బీజేపీ సీనియర్ నాయకులు శుక్రవారం బీర్‌పూర్‌లో మాట్లాడారు. నిన్నటి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో ఉండి బీజేపీని ఇష్టారాజ్యంగా విమర్శించారని, వారు ఈ రోజు బీజేపీలో చేరి, పార్టీ ద్వారా లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. మొదటి నుండి పార్టీ జెండామోసిన వారిని పక్కన పెట్టి, కొత్తవారికి పదవులు కట్టబెట్టారని, పార్టీ పదవి పొందిన వారు బిజేపిలోని ప్రతి కార్యకర్తను కలుపుకుపోవాలని సూచించారు. కొత్తగా చేరిన వారు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లను పొంది, పదవుల్లోకి రావాలని చూస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు బోరే నగేష్, జంగిలి మల్లేశం, ఇదరుగదిండ్ల చిన్నయ్య, బసవరాజుల సంతోష్, సాకపురం తిరుపతి, పత్తి రవి, రఘువీరారెడ్డి, అర్జున్, మెడి రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్



కౌన్సిలర్‌కు కండువా కప్పుతున్న నర్సింగరావు

కోరుట్ల రూరల్: పట్టణంలోని 16 వ వార్డు కౌన్సిలర్ బలిజ పద్మ బీఆర్ఎస్‌ను వీడి శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ నాయకుడు బలిజ రాజరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ యూత్ ఉపాధ్యక్షుడు బలిజ శివ ప్రసాద్, ఎంఐఎం పార్టీ మాజీ కౌన్సిలర్ చిట్యాల భూమయ్య కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న గ్యారంటీలను ప్రజలు విశ్వసిస్తున్నారని అందుకే బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

మెట్‌పల్లి: పట్టణంలో బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలకు చెందిన సుమారు 5 మంది నాయకులు శుక్రవారం కోరుట్లలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇందులో జాకీర్, ఖాజా, మొయిన్, రజాక్, ముఖీన్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని టౌన్–1 పరిధిలోని రాంబజార్, పురాణిపేట, కరీంనగర్ రోడ్, గణేశ్‌నగర్, బైపాస్‌రోడ్, అంగడిబజార్, యావర్‌రోడ్, మార్కెట్ బ్యాక్‌సైడ్, అరవింద్‌నగర్, మార్కండేయ టెంపుల్, టాకా సంది, సాయిరాంనగర్, గోవిందుపల్లి, శ్రీరాంనగర్, వెంకటాద్రినగర్ కాలనీలో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–1 ఏఈ అశోక్‌రెడ్డి తెలిపారు.

పొలాస, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో...

పొలాస, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, పొలాస, గుల్లపేట, అనంతారం గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సుందర్ తెలిపారు.

మెట్‌పల్లి పట్టణంలో..

మెట్‌పల్లి: పట్టణంలోని రాంనగర్, కళానగర్, సుల్తాన్‌పురా, ఆదర్శనగర్, దీన్‌దయాళ్‌నగర్, బాలకృష్ణనగర్, దుబ్బవాడ, రేగుంట, వెంకట్రావ్‌పేట, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రవి తెలిపారు.

అంబేడ్కర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

మేడిపల్లి: బాబాసాహెబ్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని భీమారం మండల మాల మహానాడు అధ్యక్షుడు బంగారు దీపక్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామపంచాయతీ నిధులతో అంబేడ్కర్ విగ్రహాలకు రంగులు వేయించాలని, ప్రతీ ఆఫీసుల్లో, గ్రామాల్లో అధికారికంగా కులమతాలకతీతంగా జరపాలని దీపక్ కోరారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



మహిళలతో మాట్లాడుతున్న శ్రావణి

జగిత్యాలరూరల్: కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం ధర్మారం, పొలాస గ్రామాల్లో శక్తివందన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలతో కలిసి ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు నలువాల తిరుపతి, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి సాంబారి కళావతి, రూరల్ మండల కోశాధికారి గోసంగి నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి కుర్మ రమేశ్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

కోరుట్ల: రాబోయేమే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి బాబు, కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్ అన్నారు. పట్టణంలో శుక్రవారం బీజేపీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశం, నాయకులు చెట్లపల్లి సాగర్, నవీన్, గణేష్, ఇందూరి తిరుమల వాసుజగదీశ్వర్, రుద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించాలి

మల్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు అన్నారు. మల్యాల మండలంలోని రామన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ పి.రాంబాబు సందర్శించారు. నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు తాగునీటి వసతి కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ధర్మపురి: ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగి పడి మేత మేస్తున్న ఆవు మృతి చెందింది. మండలంలోని కోస్నూర్‌పల్లెకు చెందిన బోర్లకుంట గణేశ్ అనే రైతుకు చెందిన ఆవు శుక్రవారం మేత కోసమని వెళ్లగా, విద్యుత్ వైరు తెగిపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని రైతు రోదిస్తూ తెలిపాడు. ఆదుకోవాలని కోరాడు.

నేడు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి ప్రచారం

ఇబ్రహీంపట్నం: నిజామాబాద్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి శనివారం ఇబ్రహీంపట్నంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ ఎన్నికల ప్రచారానికి జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాయికల్‌లో..

రాయికల్: పట్టణంలోని లక్ష్మీగార్డెన్స్‌లో జరిగే బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి పాల్గొంటారని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలో ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వడుకాపురం భాస్కర్ కుటుంబానికి ఆయన మిత్రులు ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన భాస్కర్‌తో 1996–97లో పదో తరగతి చదివిన ఆయన మిత్రులు రూ. 10 వేలు శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జక్కుల రవి, బషీరొద్దీన్, స్వర్గం గౌరయ్య, వొల్లాల కుమారస్వామి, దూస శ్రీనివాస్, కముటం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ..

మేడిపల్లి: నిరుపేద కుటుంబానికి చెందిన తాటికొండ మల్లమ్మ ఇటీవల మరణించగా, బాధిత కుటుంబానికి మార్కండేయ సేవా సమితి సంఘ సభ్యులు రూ.5 వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో చేపూరి నాగరాజు, బందారి నరేశ్, మహేశ్, వీరబత్తిని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కండ్లపల్లిలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామంలో వీధి దీపాలు లేక రాత్రిపూట ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చాలా రోజులుగా వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి పూట కుక్కల బెడదతో ప్రజలు బయటకు రావడం కష్టంగా ఉందని, అధికారులు దీనిపై దృష్టి పెట్టి వెంటనే వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్లపై పైనే ధాన్యం..



వెంగళాయిపేట- చిల్వకోదూర్ రహదారిపై ఆరబోసిన ధాన్యం

పెగడపల్లి: మండలంలో యాసంగి సీజన్‌లో సాగయిన వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో స్థలం కొరత నెలకొంది. దీంతో పలు గ్రామాల్లోని రైతులు ధాన్యాన్ని ఆరబోసేందుకు తప్పని పరిస్థితుల్లో రోడ్లపై ఆరబోస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయక పోవడంతో రాత్రివేళల్లో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశముంది. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.